క్లుప్తంగా

వర్సిటీ కబడ్డీ విజేత 'వివేకానంద'



విజేతగా నిలిచిన వివేకానంద డిగ్రీ కళాశాల జట్టు

కరీంనగర్‌స్పోర్ట్స్: శాతవాహన యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్సిటీ స్థాయి కబడ్డీ పోటీల్లో వికానంద డిగ్రీ కళాశాల జట్టు ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచినట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పన్యాల శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. క్రీడాకారులను కళాశాల కరస్పాండెంట్ ఆగం రావు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, బండి శ్రావణ్‌కుమార్, సంపత్ కుమార్, రామేశ్వర్‌రావు, అధ్యాపకులు అభినందించారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన

కరీంనగర్‌సిటీ: నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ప్రతిమ ఆస్పత్రి ప్రొఫెసర్ గీతారెడ్డి మాట్లాడుతూ మహిళలు ఎక్కువగా రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్నారని అన్నారు. నివారణ చర్యల గురించి తెలియజేశారు. హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వరలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ మాసూర్ సుల్తానా, కల్పన, రజినీ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరు, చెర్లభూత్కూర్, దుర్శేడ్, చామనపల్లి, బొమ్మకల్ గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను గురువారం మండల వ్యవసాయాధికారి బి.సత్యం తనిఖీ చేశారు. ఆయా గ్రామాల్లోని దుకాణాల్లోని ఎరువులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఎరువుల స్టాక్ ఫొటోలు తీసుకుని యాప్‌లో వివరాలు నమోదు చేశారు. అనంతరం చెర్లభూత్కూర్ గోదాంలో యూరియా శాంపిళ్లు సేకరించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ సింగిల్‌విండో సీఈవో రమేశ్‌తో పాటు దుకాణాల డీలర్లు పాల్గొన్నారు.

కబ్జాలపై చర్య తీసుకోవాలి

కరీంనగర్ కార్పొరేషన్: రేకుర్తిలో శ్మశానవాటిక, శిఖం స్థలాల కబ్జా చేసిన మేయర్ సునీల్‌రావుపై చర్యతీసుకోవాలని 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలత చంద్రశేఖర్ గురువారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అక్రమ లేఅవుట్‌లలో స్థలాలు కొనుగోలు చేయడమే కాకుండా, ప్రక్కనే ఉన్న స్థలాలను కబ్జా చేశారన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

అది పట్టా భూమి

రేకుర్తిలోని సర్వేనం.65లో తాను కొనుగోలు చేసిన స్థలం ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించిన పట్టా భూమి అని మేయర్ సునీల్‌రావు అన్నారు. అందులో ప్రభుత్వ భూమి ఇంచు కూడా లేదని, ఆరోపణలు, ఫిర్యాదులు పూర్తిగా నిరాధారమన్నారు.

పాఠశాలల క్రీడా పోటీల షెడ్యూల్ ఖరారు

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి జరుగనున్న ఉమ్మడి జిల్లా, జిల్లాస్థాయి పాఠశాలల క్రీడా ఎంపిక పోటీలకు సంబంధించిన తేదీలను జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్.జనార్దన్‌రావు, పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి భాషబోయిన వేణుగోపాల్‌లు గురువారం ప్రకటించారు. క్రీడాకారులు పాఠశాల నుంచి వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, ఎలిజిబిలిటీ ఫామ్‌లతో హాజరు కావాలని సూచించారు. ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో రాణించిన క్రీడాకారులను రాష్ట్ర పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

- 27న కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో అండర్–17 బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీలు

ఉమ్మడి జిల్లాస్థాయి ఎంపిక పోటీలు

- 27న కరీంనగర్ మంకమ్మతోటలోని సాయి మానేరు పాఠశాలలో అండర్–17 బాలుర జూడో
- సిరిసిల్లలో అండర్–17 బాలబాలికల కబడ్డీ
- 29న కరీంనగర్‌లోని ఫండస్ పాఠశాలలో అండర్–17 బాలబాలికల వుషు పోటీలు
- జగిత్యాలలో అండర్ 14, 17 బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీలు
- నవంబర్ 2న హుజురాబాద్‌లో అండర్ 14, 17 బాలబాలికల హాకీ పోటీలు
- నవంబర్ 2న హుజురాబాద్‌లో అండర్ 14 బాలబాలికల కబడ్డీ పోటీలు
- నవంబర్ 4న కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో అండర్ 14, 17 బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలు
- నవంబర్ 4న కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో అండర్ 17 బాలుర ఖోఖో పోటీలు

ఎస్జీఎఫ్.. ఖేల్ జోష్

- జూనియర్ కళాశాలల్లో క్రీడా సందడి
- ఉత్సాహం చూపుతున్న క్రీడాకారిణులు
- కళాశాల బాలికల్లో నూతనోత్తేజం



జూడో ఎంపిక పోటీల్లో తలపడుతున్న క్రీడాకారిణులు

కరీంనగర్‌స్పోర్ట్స్: కబడ్డీ కూత ఒకవైపు.. జింక పరుగును తలపించే ఖోఖో ఆట మరోవైపు.. ఎగిరి బంతిని చితకబాదే వాలీబాల్.. యుద్ధాన్ని మైమరిపించే జూడో, రెజ్లింగ్, బాక్సింగ్, వుషు లాంటి క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొంటూ.. నూతనోత్తేజంతో ఎస్జీఎఫ్ గేమ్స్‌లో బాలికలు అరగ్రేటం చేస్తున్నారు. 2024– 25 క్రీడా సంవత్సరానికి గాను క్రీడా సమాఖ్య కార్యదర్శులు షెడ్యూల్‌లు విడుదల చేశారు. స్కూల్‌గేమ్స్ పరీక్షల కారణంగా కొంత మేరకు బ్రేక్ పడగా.. కళాశాలల క్రీడా పోటీలు జోరుగా సాగుతున్నాయి. పోటీల్లో బాలురతో పాటు మేముసైతం అంటున్నారు బాలికలు. కళాశాలస్థాయి ఎస్జీఎఫ్ క్రీడాపోటీలతో కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియం సందడిగా మారగా.. దేశం కోసం ఆడాలన్నదే తమ లక్ష్యమని చెబుతున్న పలువురి అభిప్రాయాలు..

జాతీయస్థాయిలో పతకమే నా ఆశయం



జాతీయస్థాయి యోగా పోటీల్లో పతకం సాధించాలనేది నా ఆశయం. ఇప్పటి వరకు నాలుగుసార్లు జాతీయ పోటీల్లో పాల్గొన్న. రాష్ట్రస్థాయి పోటీల్లో చాలాసార్లు పాల్గొని పతకాలు సాధించా. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా పోటీల్లో సెలక్ట్ అయ్యా. రాష్ట్ర, జాతీయ పోటీల్లో పతకం సాధించడమే లక్ష్యంగా సాధన చేస్తా. – బి.ధృతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్, కరీంనగర్

తొలిసారి చెస్‌లో విజేతగా నిలిచా



చెస్‌లో తొలిసారి విజేతగా నిలిచా. హ్యాపీగా ఉంది. ఉమ్మడి జిల్లా పోటీల్లో విజయం సాధించి రాష్ట్ర పోటీలకు ఎంపిక అయ్యా. లాస్ట్ టైం కూడా ఎస్జీఎఫ్ పోటీల్లో పాల్గొన్న. ఈసారి రాష్ట్రస్థాయి పోటీల్లో ఏదో ఒక పతకంతో తిరిగి రావాలని ఉంది. చెస్‌లో కోచింగ్ బాగా తీసుకుంటా.

– శ్రీహస్న, ఇంటర్ సెకండ్ ఇయర్, కరీంనగర్

జూడోలో పతకం సాధిస్తా



యుద్ధ క్రీడ జూడో. చాలా టఫ్ గేమ్. ఫస్ట్ టైమ్ పాల్గొన్న. గేమ్ చాలా బాగుంది. ఉమ్మడి జిల్లాస్థాయిలో రాణించా. కరీంనగర్‌లో జరిగే రాష్ట్ర పోటీలకు ఎంపిక అయ్యా. హ్యాపీగా ఉంది. ఇక నుంచి రోజూ ప్రాక్టీస్ చేస్తా. జూడోలో పతకం సాధిస్తాను.

– ఎలీస్ జోనాషారూన్, ఇంటర్ ఫస్ట్ ఇయర్, కరీంనగర్

సాకర్ చాంపియన్ కావాలని..



రాజన్న సిరిసిల్ల జిల్లా చిన్నబోనాల గురుకుల కళాశాలలో చదువుతున్న. ఎస్జీఎఫ్ కాలేజ్ గేమ్స్‌లో నేను ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న. మా కాలేజ్ టీం చాలా బాగా ఆడింది. సాకర్‌లో చాంపియన్‌గా నిలువాలనేది నా ఆశయం.

– విష్ణుత, ఇంటర్ ఫస్ట్ ఇయర్, చిన్నబోనాల

వాలీబాల్‌లో రాణించాలనేది లక్ష్యం



మాది ధర్మారంలోని మోడల్ స్కూల్. వాలీబాల్ పోటీల్లో ఎస్జీఎఫ్ గేమ్స్‌లో పాల్గొన్న. బాగా ఆడాం. ప్రస్తుతం వాలీబాల్ క్రీడ క్రేజీ అయింది. చాలా మంది ప్లేయర్స్ ఆడుతున్నారు. అందుకే నేను కూడా వాలీబాల్‌పై ఆసక్తి పెంచుకున్న. భవిష్యత్‌లో వాలీబాల్‌లో గొప్ప ప్లేయర్ అవుతా.

– అశ్విత, ఇంటర్ ఫస్ట్ ఇయర్, ధర్మారం

పోటీలకు స్పందన పెరిగింది



ఎస్జీఎఫ్ కళాశాలల గేమ్స్‌కు స్పందన పెరిగింది. ఉమ్మడి జిల్లా ఎంపిక పోటీలను కరీంనగర్ కేంద్రంగా నిర్వహిస్తున్న. ఈ సంవత్సరం జరుగుతున్న ఎంపిక పోటీలకు క్రీడాకారిణుల నుంచి భారీ స్పందన వస్తోంది. క్రీడలకు పూర్వ వైభవం వచ్చేలా బాలికలు పోటీల్లో పాల్గొని ఆదర్శంగా నిలుస్తున్నారు.

– జి.మధుజాన్సన్, ఎస్జీఎఫ్ కళాశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి

క్రాప్ డిజిటల్ సర్వే ప్రారంభం

- సాంకేతిక కారణాలతో ఇబ్బంది



చామనపల్లిలో పత్తిపంటను యాప్‌లో నమోదు చేస్తున్న ఏఈవో సుచరిత

కరీంనగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన క్రాప్ డిజిటల్ సర్వేను గురువారం కరీంనగర్ మండలంలో ఏఈవోలు ప్రారంభించారు. డిజిటల్ సర్వేను చేయలేమంటూ కొన్ని రోజులుగా సమ్మెకు దిగిన ఏఈవోలు ఎట్టకేలకు విధుల్లోకి హాజరయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చామనపల్లి క్లస్టర్‌లో ఏఈవో సుచరిత, మొగ్ధుంపూర్‌లో స్వర్ణలత, దుర్శేడ్‌లో పైడితల్లి, నగునూరు క్లస్టర్‌లో ఉదయ్‌లు డిజిటల్ సర్వే చేపట్టారు. ఆయా క్లస్టర్ పరిధిలోని ఒక్కో గ్రామంలో ఏఈవోలు సర్వే నిర్వహించారు. అయితే కొందరు ఏఈవోల స్మార్ట్‌ఫోన్లలో టెక్నికల్ కారణాలతో యాప్ ఓపెన్ కాలేదు. అంతేకాకుండా పొలాల వద్దకు వెళ్లినప్పటికీ రైతు పేరు, సర్వే నంబర్లు యాప్‌లో కనిపించలేదు. మహిళా ఏఈవోలు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పంటల వివరాలను యాప్‌లో నమోదు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పొలాలకు వెళ్లే మట్టిదారులన్నీ బురదగా మారడంతో నడిచి వెళ్లేందుకు పడరానీపాట్లు పడ్డారు. రైతుల పొలాలను గుర్తించేందుకు స్థానిక రైతులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే మూడు రోజుల పాటు మోడల్ సర్వే నిర్వహించిన అనంతరం ఏఈవోలతో ఈనెల 28న ప్రభుత్వం చర్చలు జరిపే అవకాశముందని ఏఈవో అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొంటున్నారు. గ్రామాల్లో డిజిటల్ సర్వే చేసేందుకు ఏఈవోలకు సహాయకులను నియమిస్తేనే సర్వే చేస్తామనే ప్రధాన డిమాండ్‌తో చర్చలుంటాయని తెలిపారు.

బ్లడ్ స్టోరేజీ

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ స్టోరేజీ సెంటర్‌లో గురువారం వరకు ఏ పాజిటివ్ 09, బీ పాజిటివ్ 11, ఓ పాజిటివ్ 18, ఓ నెగెటివ్ 01 యూనిట్ల రక్తం అందుబాటులో ఉందని రెడ్‌క్రాస్ సెక్రటరీ ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి తెలిపారు. అత్యవసరంగా రక్తం కావాల్సిన వారు ఫోన్: 95025 02942 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నామమాత్రంగా ఈజీఎస్ గ్రామసభలు



నల్లగుంటపల్లి గ్రామసభలో పాల్గొన్న గ్రామస్తులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్, నల్లగుంటపల్లి గ్రామాల్లో గురువారం ఉపాధిహామీ పథకం గ్రామసభలు నిర్వహించారు. ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో చేపట్టే ఉపాధిపనులపై గ్రామస్తులతో అధికారులు చర్చించి తీర్మానం చేశారు. అయితే ఈనెల 16నుంచి నిర్వహిస్తున్న గ్రామసభల్లో ప్రజల భాగస్వామ్యం కరువైంది. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ అధికారులు గ్రామసభల నిర్వహణపై సరైన ప్రచారం చేపట్టకపోవడంతో గ్రామస్తులు ఎక్కువ సంఖ్యలో హాజరుకాలేకపోతున్నారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ శాఖల ప్రతినిధులు, కూలీలతో గ్రామసభలు నామమాత్రంగా నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ కార్యక్రమాల్లో ఏపీవో శోభారాణి, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు సంతోష్, శ్రీనివాస్, ఫీల్డ్‌అసిస్టెంట్లు, కూలీలు పాల్గొన్నారు.

నియామకం

ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా రవి



రవి

సప్తగిరికాలనీ: ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా మానుపాటి రవి, ప్రధాన కార్యదర్శిగా బిజిలి శ్రీనివాస్‌లు నియామకమయ్యారు. ఈమేరకు గురువారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరాయ సాయిలు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి చర్యలు



ఎంఈవో రవీందర్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని కరీంనగర్ మండల విద్యాధికారి కె.రవీందర్ తెలిపారు. గురువారం ఎమ్మార్సీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డీఈవో ఆదేశాల మేరకు ప్రతీరోజు రెండు పాఠశాలలను సందర్శించి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించడంతో పాటు విద్యార్థుల సంఖ్య పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు. మధ్యాహ్నభోజన పథకాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించనున్నట్లు చెప్పారు. పాఠశాలల్లో స్నేహిత కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

పాలక వర్గాన్ని నియమించాలి

కరీంనగర్: రజక కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి పాలకవర్గాన్ని నియమించాలని రజక సంఘాల వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ డిమాండ్ చేశారు. గురువారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రజకులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రజక కార్పొరేషన్‌కు రూ.5000 కోట్లు కేటాయించాలన్నారు. ఉచిత విద్యుత్‌ను ఎల్‌టీ2 నుంచి ఎల్‌టీ4కు మార్చాలని, 50ఏళ్లు దాటిన రజక వృత్తిదారులకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో రజకులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అనిల్, శంకర్, కుమార్, నరేశ్, శ్రీకాంత్, అశ్విన్, లక్ష్మణ్, శ్రీపాల్, వెదిర, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్జీఎఫ్ కళాశాల ఖోఖో విజేతలు మానకొండూర్, చింతకుంట





బాలుర, బాలికల విభాగంలో విజేతగా నిలిచిన మానకొండూర్, చింతకుంట కళాశాలల జట్లు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో గురువారం జరిగిన ఎస్జీఎఫ్ అండర్–19 బాలబాలికల ఖోఖో పోటీలు హోరా హోరీగా సాగాయి. పోటీల్లో మానకొండూర్, చింతకుంట గురుకుల కళాశాలల జట్లు ప్రతిభ కనబర్చాయి. బాలుర విభాగంలో టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ మానకొండూర్ జట్టు విజేతగా నిలువగా.. టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ రుక్మాపూర్ జట్టు రన్నర్‌గా నిలిచింది. అదే విధంగా బాలికల విభాగంలో టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ చింతకుంట జట్టు విజేతగా నిలువగా ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌జేసీ గంగాధర జట్టు రన్నర్‌గా నిలిచింది. బహుమతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్ హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాధన చేస్తేనే క్రీడల్లో విజయాలను సొంతం చేసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్జీఎఫ్ కార్యదర్శి మధుజాన్సన్, పీడీలు ప్రసాద్, ఇనోక్, బాలసుందర్, నారాయణ, అశోక్, సుజాత, శివ ప్రసాద్, రాజశేఖర్, నరేశ్, రవీందర్, గౌతమ్, శ్రీనివాస్, నాగరాజు, తిరుపతి, రాజు, మార్కండేయ, హేమలత, రమేష్, పాషా, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కరీంనగర్‌క్రైం: మద్యానికి బానిసైన వ్యక్తి తాగి పలుమార్లు కిందపడగా తలకు బలంగా తగిలిన గాయంతో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నగరంలోని మారుతీనగర్‌కు చెందిన ఎండీ. అక్బర్‌ఖాన్ (44) పెయిటింగ్ పనులు చేస్తుంటాడు. ఐదేళ్ల నుంచి తాగుడుకు బానిసైన అక్బర్ పలుమార్లు తాగిన తర్వాత ఫిట్స్ వచ్చి కిందపడిపోయేవాడు. పదిహేనురోజుల క్రితం పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. ఈనెల 21న కూడా బొమ్మకల్ చౌరస్తాలో కిందపడడంతో తలకు రక్తం వచ్చింది. ఇంట్లో పడుకుని తెల్లవారి లేవకపోవడంతో కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా డాక్టర్ల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

స్తంభం సరిచేశారు



సాక్షి స్పందన

కరీంనగర్ కార్పొరేషన్: నగర పాలక సంస్థ కార్యాలయ దుకాణ సముదాయం వద్ద ప్రమాదకరంగా మారిన వీధిదీపాల విద్యుత్ స్తంభాన్ని సరిచేశారు. మార్కెట్ వైపున ఉన్న దుకాణ సముదాయం ముందున్న విద్యుత్ స్తంభాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వంగిపోయి ప్రమాదకరంగా మారింది. దీనిపై ఈనెల 23వ తేదీన వాట్సప్ శీర్షిన 'సాక్షి'లో వచ్చిన కథనానికి స్పందించిన నగరపాలక సంస్థ అధికారులు స్తంభాన్ని సరిచేశారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 94400 77555

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



ఓటరు నమోదు పత్రాలు అందజేస్తున్న సత్యనారాయణ

కరీంనగర్: ఉపాధ్యాయుడిగా 28 ఏళ్ల సర్వీపు పూర్తి చేసుకున్నానని, విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై అవగాహన ఉందని పోలు సత్యనారాయణ అన్నారు. గురువారం కరీంనగర్‌లోని వివిధ విద్యాసంస్థల్లో ఓటరు నమోదు పత్రాలు అందజేస్తూ మాట్లాడారు. టీచర్ ఎమ్మెల్సీగా గెలిపిస్తే శాసనమండలిలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. అనంతరం మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వరలక్ష్మి, హెడ్ ఆఫ్ కెమిస్ట్రీ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులను కలిసి ఓటరు నమోదు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జీహెచ్‌ఎం రాజలింగం, తాటి రాజేశ్వర్ రావు, బొద్దుల లక్ష్మయ్య, రమేశ్, మునీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదులో లోపాలు సరిచేయండి



సీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న హరికృష్ణ

కరీంనగర్ కార్పొరేషన్: పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియలో నెలకొన్న లోపాలను సరిచేయాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని కోరారు. ఈమేరకు గురువారం హైదరాబాద్‌లో ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆన్‌లైన్ ద్వారా ఫారం 18లో అప్‌లోడ్ చేసిన డాక్యుమెంట్స్‌ను సంబంధిత బీఎల్‌వోలు దరఖాస్తు దారు ఇంటికి వెళ్లి పరిశీలన చేయాల్సి ఉందన్నారు. కాని దరఖాస్తుదారులను అటెస్టెడ్ కాపీలు తీసుకొని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు రమ్మని ఒత్తిడి చేయరాదన్నారు. ఇది పట్టభద్రులను ఇబ్బంది పెట్టడమే కాకుండా, ఆన్‌లైన్ దరఖాస్తుల ఉద్దేశాన్ని దెబ్బతీసినట్లవుతుందని వివరించారు. ఇందుకు ఎన్నికల ప్రధాన అధికారి సానుకూలంగా స్పందించి, అందుకు అనుగుణంగా ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చినట్లు హరికృష్ణ తెలిపారు.

ప్రతీ పట్టభద్రుడు ఓటు నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న జనార్దన్

కరీంనగర్: ప్రతీ పట్టభద్రుడు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని యువ నాయకుడు జనార్దన్ అన్నారు. గురువారం ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఆరెకటిక కుల పట్టభద్రుల, విద్యావంతుల సమావేశంలో మాట్లాడారు. తాను ఆరెకటిక కులం నుంచి చిన్న సామాన్య కుటుంబం నుంచి వచ్చానని అన్నారు. సమాజసేవలో ముందుకు పోవాలని అనుకుంటున్నట్లు తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆశీర్వదిస్తే నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం చూపించే విధంగా కృషి చేస్తానని అన్నారు. యువత రాజకీయాల వైపు మొగ్గు చూపాలని సూచించారు. యువత తలచుకుంటే ఏదైనా సాధించవచ్చునని తెలిపారు.పట్టభద్రులందరూ తనకు చేదోడు వాదోడుగా ఉండాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఆరెకటిక పట్టభద్రులు పాల్గొన్నారు.

కుల గణనలో నమోదు చేసుకుందాం



సంఘీభావం తెలుపుతున్న ముదిరాజు నాయకులు

విద్యానగర్(కరీంనగర్):రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ నుంచి ప్రారంభించనున్న సమగ్ర కుల గణనలో ముదిరాజులు పేర్లు నమోదు చేసుకుని వెనుకబడి ఉన్న విషయాన్ని చాటి చెప్పాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం అన్నారు. గురువారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమగ్ర కులగణన సర్వేతో పాటు పేద, అతి పేద, జీవన విధానం నమోదు చేయనున్నారని, అన్నారు. వెనుకబడిన కులాల్లో ముదిరాజులు కూడా విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో చాలా వెనుకబడి ఉన్నారన్న విషయాన్ని ప్రభుత్వానికి తెలిసేలా తమ ఆర్థిక విషయాలతో పాటు వెనకబడిన రంగాలను వివరిస్తూ తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ముదిరాజ్ మహాసభ నాయకులు పండుగ బాలు, కోలకాని నర్సయ్య, బొమ్మరవేని తిరుపతి, గూడిల్ల రాజ్‌కుమార్, రెడ్డి సురేశ్, బాసవేని శ్రీనివాస్, పిట్టల లింగయ్య, కొలిపాక మల్లికార్జున్, రెగుల అశోక్, బిక్షపతి, శంకరన్న, సమ్మయ్య, రాజశేఖర్, రమేశ్, బాను, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



కరీంనగర్: మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ దంపతులు గురువారం పరామర్శించారు. గంగుల లక్ష్మీ నర్సమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్: రాజశేఖర్ - 9618304759
చొప్పదండి: ముందయ్య - 7997958217
మానకొండూర్: మహేశ్ - 9573106760
హుజూరాబాద్: రమేష్, ACO - 7997958214
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899